నినాదం నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 22-03-2026

లే...
కూర్చుంటావేంటలా?

ఎందుకుండవు అమ్మలా
వడివడిగా సాగే ప్రవాహంలా
స్వచ్ఛంగా ఎందుకు లేవు నాన్నలా
పదునెక్కిన దుక్కినాగలిలా !
అమ్మ ఆశలన్నీ
ఎదిగే శిశువుల పూలరంగులే
అమ్మ ముడతలన్నీ
ఒదిగే అనురాగపు దొంతరలే !
రుణానుబంధాలన్నీ
ఆ తండ్రి ఊపిరులే
గుర్తింపు పొగడ్తలన్నీ
ఆ తండ్రి సువాసనలే !
ఏం సాధించావని
నీదైన జీవితానికి ?
కాలాలని ఒంటి చేత్తో
జయించగలిగావా !
ఏకాంతాలని ఏకాకిలా
ఓడించగలిగావా !
ఏం నిరూపించావని
వారి ఉనికికి ?
నీ కలలెంట పరిగెత్తిన
అమ్మ కలల విలువకు
గుడి కట్టగలిగావా !
నీ దారుల్లో ముళ్ళనేరిన
నాన్న కాళ్లను శిఖరాన
నిలబెట్టగలిగావా !
అసలు ఏం సాహసించావని
వారికోసం నిజానికి ?
అమ్మ చీరను పెళ్లి చీరగనైన
చుట్టగలిగావా !
నాన్న చేతికి ఊత కర్రగనైన
నిలవగలిగావా !
అర్ధరూపాయకు సైతం
కొరగాని నువ్వు ...
ఎందుకుండవు అమ్మలా
నిండైన కుండలా !
ఎందుకుండవు నాన్నలా
నిత్యం ఒళ్ళొంచే విల్లంబులా !

పి.మృదుల
63039 09565

జుడుగుడు

మనసులోన దేవుడుంటే
మహికెల్లా చాటాలా?
మైకు బెట్టి, పూరుచుట్టి
రచ్చజేసి, రెచ్చగొట్టి
మతం పేర భయం చూపి
భిన్న మతా లణచాలా?

జగతి దేవుడు నిండివుంటే
ఎందుకింత జాతర?
నిర్గతి జీవుల పట్ల
ఎందుకు లేదు ఖాతర?

కూలినాలి బదుకుదెరువు
ఆలుచూలుల – ఆదరువు
కూడు లేదు నీడలేదు
గోడు వినే తోడు లేదు

మాకులేని ఇల్లు, గుళ్ళు
నీకెందుకు పెరుమాళ్ళు?
మాకు లేని తిండితిప్పలు
మీకాడ కెట్ల – నాయకులు?

ఎరలు వేసి మరులు గొల్పి
నిరక్షరుల మాయ సలిపి
ఎన్నికల్లో గద్దెకోసం
ఎన్ని నాళ్ళీ మోసం

నిజం తెలిసి, కన్ను తెరచి
ప్రజయే మేల్కొన్న నాడు
ఆకటి మండిన కడుపుల
కూకటితో మీ దిగదిడుపులు

గుడి వెలుపల మేమంతా
గుడి లోపల మీరంతా
'దేహి' నే – మన మందరు
బిక్షగాళ్ళేమరి – అందరూ

కనలి,కనలి రాజుకుని
మారాజుల బూజు దులిపి
ఈ త్యాజ్యం కడిగేసే అడుగేసే
ఆ రోజే రానున్నది. ఈ 'రోజు'
పోనున్నది.

- ప్రతాప్ రాజులపల్లి
97698 55645

చరిత్ర తిరగబడితే

పసి పాపను
అవును నేనొక పసి కూనను
కుమ్మెర నా ఊరు
నాగర్ కర్నూలు జిల్లా
నాకు పానం బోసిన తల్లి సాకల్ది
ఊరోళ్ళ పయి మీది బట్టల్ని సాపు చేసేది
మా నాయిన పండుగ పబ్బాలనాడు
సావు పుట్టుకల నాడు దివిటీ పట్టేటోడు
ముట్టు బట్టల మురికి సవుడుతో తీసి
మల్లెపువ్వోలె తెల్లగా చేసేటోళ్ళు మా వోళ్ళు
మాయిలో పుట్టిన మా పటేలమ్మ కొడుకును
ముందుగాల ముట్టుకున్నది మా సాకలి తల్లే
మంత్రసానులుగా మారి మా తల్లులు పురుడు పోస్తే
మానవత్వం లేని అదే పటేలు నా తల్లిని తన్నబట్టే
ఎన్నడు ఏ పాపం చేయలే
లేక లేక నేను కడుపుల పడ్డదే
ఇప్పుడు మావోళ్లకు పెద్ద శాపం అయ్యింది.
సాకలి కులంలో పుట్టడం వల్లనే
నా తల్లికి పుట్టెడు శోకం మిగిలింది
జాతర్ల బొమ్మలు ఇప్పిద్దామనుకున్న నా
తలితండ్రికి కను బొమ్మలు చెమ్మగిల్లినయ్
తల్లి కడుపులో నేనున్నప్పుడు
కులం అనవాళ్లు నాకు ముందే తెలుసుంటే
ఈ కులం కోరలు నన్ను చంపేస్తాయని
నా జీవితానికి విషపు గీతలు గీస్తారని
ముందే నేను పసిగట్టి ఉండుంటే
ఈ నేల మీదికి నన్ను రానీయకని
బమ్మ దేవుడికి మొరపెట్టుకుంటుంటి
నా తల్లికి పుత్ర శోకం ఇవ్వొద్దని
రెడ్లు నా తల్లి రొమ్ముల మీద గుద్దుతుండ్రు
నా తండ్రి కాల్చేతులు కట్టెలోలే ఇడుస్తుండ్రు
నా గొంతు మీద కాలు పెట్టీ తొక్కుతుండ్రు
నేనేమీ పాపం చేశానో, నా వాళ్ళు ఏం చేశారో
నాది వెలివేయబడ్డ కులం అన్న సంగతి
నాలాంటి పసి కందుల్ని బతకనీయకుండా
కోట్లల్లో పొట్టన పెట్టుకున్నారని నాకేం తెలుసు
ఇలాంటి సావు సస్తున్నందుకు బాధగా ఉంది
నా తాతల కాలం నుండి సేవ చేసినోళ్లమే గానీ
ఏనాడు మా చాకిరికి ఇంతని వెల కట్టలేదు
గుమ్మం ముందు ఒట్టి రొట్టెకు ఆశపడ్డోళ్లమే గానీ
కాసిన్ని గింజలు ఎక్కువేయండని నోరు చాచనోల్లం
వేల ఏండ్లుగా ఈ దౌర్జన్యాలు ఉన్నాయని
లక్షల తల్లుల దుఃఖాలకు కులమే కారణమని
కొమురెల్లి మల్లన్న సాక్షిగా ఇప్పుడే తెలిసింది
కాపోల్ల కాళ్ల కాడనే ఉన్నాం గానీ
వాళ్ళను కన్నెత్తి చూడనేలేదు
రెడ్ల కోసం మా రెక్కలను విరిచామే గానీ
రెప్ప కూడా ఎగిరేయలేదు
సేవలు చేయించుకున్న చేతులతోనే
నా కుటుంబాన్ని చిత్రహింసలు పెడుతున్నరు
శుభ్రతను నేర్పిన మా కులం కూడా

అంటరానిదేనని రుజువైపోయింది
ఒక నిథారి, ఒక ఉన్నావో, ఒక కథువా
అందరూ నా లాగే కుల హత్యలకు గురయ్యారని
ఖైర్లాంజీ కాదా మమ్మల్ని ఖతం చేశారని
హాథ్ రాస్ లో మా ఆడబిడ్డలు అంతం చేశారని
మిర్చ్ పూర్ లో నాలాంటి బాలికపై దాడి చేశారని
తమిళనాడులో మా శంకరన్న కులాంతర వివాహం
మిర్యాలగూడలో ప్రణయ్ హత్య గావించబడడం
ఏ దేవుడికి కానరాలేదేమో,
కళ్ళు కానీ మూసుకున్నాడేమో
అయినా నా సావు నిండు గుడి
ఆవరణలోనే కదా జరిగింది

నీటి కుండకు పవిత్రతను అంటగట్టిన దేశం
మనిషి ప్రాణానికి విలువెందుకిస్తుంది
పసిపిల్లలు రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్ళారని
కర్రలతో కొట్టి చంపే దుర్మార్గపు దేశం
కడు పేదలకు కంటి నిండా నిద్రెందుకు రానిస్తుంది
కులం కంచె దాటిందని కూతురిని?
విధవను చేసే దేశం
ప్రేమనెట్ల చిగురించనిస్తుంది
చంద్రుడు మీద కాలు మోపే రోజుల్లో నా దేశం
మనువాదపు మురికిలోనే కూరుకుపోయింది
పిల్లలు దేవుళ్ళతో సమానమన్న నా దేశమే
కులమనే కత్తితో రక్తాన్ని చిందిస్తుంది

నా భవిష్యత్తును ఆపేసిన మూర్ఖుల్లారా
మీకేం తెలుసు రేపు నేనేమయ్యేదాన్నో
సావిత్రి పూలేనయ్యి చదువు చెప్పేదాన్నేమో
పూలందేవినయ్యి పులిలా గర్జించే దాన్నేమో
రమాబాయిలా భారత మాతను అయ్యేదాన్నేమో
చాకలి ఐలమ్మలా పోరాట యోధురాలునయ్యేదాన్నేమో
నా కుతికెను నొక్కిన మీక్కూడా పిల్లలుంటారు కదా
నా తల్లి లాంటి తల్లులు మీకూ ఉన్నారు కదా
మీ మను మెదడుకు మానవత్వం గుర్తు రాలేదా
మాయవతులు మొలిచినా మీ దాష్టీకాలు ఆగవా

ఈ నెత్తుటి చారలను, మీ విషపు కోరలను
పసి మొగ్గల్ని తుంచేస్తున్న మీ రాక్షస కత్తులను
రెండు మాడిపండ్ల కోసం పానం తీసిన పాపాలను
నడిచే దారిని బట్టి నరకయాతన పెట్టిన క్రూరాలను
ఆడబిడ్డలను హత్యాచారాలు చేసిన అహంకారాన్ని

అణచడానికి అంబేద్కర్ మా వెంటే ఉన్నాడు
ఈ దేశపు పునాదుల్లో ఉన్నది మా చెమట
రాజ్యాంగపు అక్షరాల్లో ఉన్నది మా మేధస్సు
అణగారిన వర్గాల గొంతుక ఇప్పుడు పెను తుఫాను
అణిచివేసే కొద్దీ అది అగ్నిపర్వతమై పేలుతుంది
అధికారం మీ చేతుల్లో ఉండొచ్చు కానీ
చరిత్ర తిరగబడితే మీ అహంకారపు కోటలు
మీ మనువు గాళ్ల రాజ్యం కూలక తప్పదు

-అంజి ఎర్రోళ్ల
95425 77604

మా ఊరి మట్టి వాసన

తాటికమ్మలు కంపచెట్లతో
మోడు బారి ఉన్న మా పల్లె
రంగుల భవనాలతో
కొత్త అభివృద్ధికి శ్రీకారం చుట్టింది!
గేరుగేరుకు సిసి రోడ్డె ఇంటింటికి
మంచి నీళ్ళె మంచితనానికి
మారు పేరై మారుతుంది మా ఊరు!
మా ఊరి చెరువు
వాన జలాలతో నిండుకొని సంధ్యవేల
సాయంత్రం పొద్దున సూరీడు పంపిన
ఎర్ర చీరతో సింగారంగా ముస్తాబైతుంది
అలా చెరువు కట్ట నుంచి చూస్తే గాని కంటికి
కనిపించని "కవరాతి బండ" కూని రాగాలు
ఎత్తుకున్న చెరువంచు ఊర పిచ్చుకలు
వేసవి గాలులు వీయక ముందే
మా ఊరి "గజ్జలబండ తాళ్ళల్లా"
ఊట సెలిమేలోలే తాటికళ్ళు ఉప్పొంగుతుంది!
పొద్దుమూకిందంటే ఊరి జనాలు సోయి
ఎరుగక మాటలు బంగారమైతయ్!
బతుకు మీద భరోసాతో
ఊరి మీదుగా పోయే పట్నం
బస్సు ఎక్కి పొలిమేర అంచున
ఉన్న పంట లచువమ్మా తల్లిని
అన్ని నీవే అని కుటుంబ బరువు భాధ్యతల్ని
తలుసుకొని పోతుంటే కడుపులో
కలుక్కుమనేది!
మల్లొకసారి మా ఊరి మట్టి వాసనను తాకి
మనసులో తలుసుకొని కలె తిరిగిన దోస్తులను
కలిసిరావాలని ఉంది!

- జగదీష్ కట్ట
80963 05958

శ్రామిక జీవన సౌందర్యం, మానవ జీవన తాత్త్వికతల సమ్మేళనం అలుగ్గుడ్డ

"అలుగ్గుడ్డ" వచన కవితను రచించిన వారు ఆచార్య చల్లా శ్రీరామ చంద్రమూర్తి గారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం (BHU), వారణాసిలోని తెలుగు శాఖలో సుదీర్ఘకాలం ఆచార్యులుగా, శాఖాధి పతిగా సేవలు అందిస్తున్నారు. అంతకుముందు విజయవాడలోని ఒక స్వయం ప్రతిపత్తి కళాశాలలో పనిచేశారు. శ్రీరామ చంద్రమూ ర్తిగారు కేవలం విద్యావేత్తగానే కాకుండా, కవిగా, విమర్శకుడిగా వివిధ సామాజికాంశాలపై స్పందిస్తూ తనదైన ముద్ర వేశారు. బెనారస్ వంటి చారిత్రక నగరంలో ఉంటూనే తెలుగు తనాన్ని, శ్రమ జీవుల వేదనను అప్పుడప్పుడు కవిత్వం కూడా రాస్తుంటారు. రాసిన కవితలు సంఖ్యాపరంగా తక్కువే. కానీ, అవి ఎంతో విలువైనవి కావడం విశేషం. అటువంటి వాటిలో ఆయన రాసిన 'అలుగ్గుడ్డ' కవిత సామాన్యమైన ఒక పాత గుడ్డ ముక్క ఆత్మకథలా కనిపిస్తున్నప్పటికీ, అందులో లోతైన సామాజిక, మానవీయ ప్రతీకాత్మ కతను గమనించాలి. *"అలుగ్గుడ్డకదా! అని తేలిగ్గా చూడకు నన్ను! ఇల్లు శుభ్రపరుస్తున్నాననే విషయాన్ని మర్చిపోకు" అని ప్రారంభమయ్యే ఈ కవితలో కొన్ని పాదాలు శ్రామికుడినీ, దళితుల్నీ వర్ణిస్తు న్నట్లు అనిపిస్తుంది. "కంపులీనుతున్న ఫినాయిలు నీటిలోనో/ కంటికింపైన సోపాయిలు నీరులోనో / కొండొకచో రకరకాల యాసిడ్లలోనో"* మునిగి తేలుతున్న అలుగ్గుడ్డలాగే ఈ దేశంలో నేటికీ యంత్రాలకంటే చౌకగా పనికి దొరుకుతున్న వాళ్ళు సఫాయి కార్మికులు. ఈ వర్ణన వారిని గుర్తు చేస్తున్నట్లనిపిస్తుంది.

నిస్వార్థ సేవకు ప్రతీక:

'అలుగ్గుడ్డ' (ఇంటి నేలను తుడిచే గుడ్డ) తన ఉనికిని కోల్పోతూ ఇతరుల మురికిని కడుగుతుంది. ఇది సమాజంలోని నిస్వార్థ సేవకులకు, కార్మికులకు ప్రతీక." *మలిన మైన ఇంటి గదుల్ని తళుకులీనేలా చేయడంలో నా జీవిత చరమాంకంలో నలుపురంగు సంతరించుకుంటోంది"* అని మన జీవితాల్లో వెలుగు నింపడానికి తమ జీవితాలను ధారబోసే త్యాగధనులను స్ఫురింపజేస్తుంది. ఇది సమాజ శ్రేయస్సు కోసం తమను తాము కరిగించుకునే నిస్వార్థ శ్రమజీవులకు సజీవ ప్రతీక. కవితా ప్రారంభంలోనే *"ఇల్లు శుభ్రపరుస్తున్నాననే విషయాన్ని మర్చిపోకు/అవసాన దశలో కూడ సేవలంది స్తున్నానని సంతోషించు"* అంటూ అలుపెరగని సేవకుడి ఆర్తిని వినిపిస్తాయి. తన సహజమైన 'నిర్మల రంగు'ను కోల్పోయి, నలుపును పులుముకున్నా సరే, ఇతరుల గదులు 'తళుకులీనడం' ముఖ్యం అనుకునే ఆ భావన సమాజంలోని అట్టడుగు వర్గాల కార్మికుల త్యాగాన్ని సూచిస్తుంది. సమాజం తనను పెంటకుప్పలో పారవేసినా, తాను మాత్రం *"నరజాతికి హితైషిని, లోకబంధుని"* అని చాటుకోవడం ద్వారా, నిస్వార్థ సేవకులకు ఉండే విశాల హృదయాన్ని, వారి గొప్పతనాన్ని కవి ఈ కవితలో అద్భుతంగా ఆవిష్కరించారు.

వినియోగ సంస్కృతి:

వస్త్రం పత్తిగా ఉన్నప్పుడు, కొత్త బట్టగా ఉన్నప్పుడు దానికి ఇచ్చే గౌరవం అది పాతబడగానే మృగ్యమవుతుంది. ఇది మనుషుల మధ్య ఉండే అవసరార్థపు సంబంధాలకు అద్దం పడుతుంది. శక్తి ఉన్నంతవరకు వాడుకుని, వయసు పైబడిన తర్వాత లేదా అవసరం తీరిన తర్వాత మనుషులను 'అలుగ్గుడ్డ'లా పారేసే ఆధునిక ధోరణిని కవి చర్చకు పెట్టారు. 'వినియోగ సంస్కృతి' (Use and Throw Culture) మనిషి నైజాన్ని, సమాజంలో పెరుగుతున్న అవసరార్థపు సంబంధాలను ఎండగడుతుంది. *"ఏపుగా పెరిగి, గుబురుగా విచ్చుకున్నాను... దర్జీల నేర్పులకు సుందరాకృతులొందాను"* అంటూ తన యవ్వన దశలో (కొత్త వస్త్రంగా ఉన్నప్పుడు) అందరినీ మురిపించి, వారి *"మానాభిమానాలు కాపాడి తరించాను"అని 'అలుగ్గుడ్డ' చెప్పుకుంటుంది. అయితే, అదే వస్త్రం "కాలంతీరి రోజులు మారి ముదుసలినై"* పోగానే, సమాజం చూపే వివక్షను కవి అత్యంత హృద్యంగా చిత్రించారు.

"అందం మందగించేసరికి అలుగ్గుడ్డనైతి!" అన్న వాక్యం, కేవలం వస్తువులకే కాక, వయసు మళ్ళిన మనుషులకు, శక్తి ఉడిగిపోయిన శ్రామికులకు కూడా వర్తిస్తుంది. అవసరం ఉన్నంత కాలం నెత్తిన పెట్టుకుని, ఆకర్షణ తగ్గగానే చిన్న చూపు చూసే ఆధునిక ధోరణిని ఇక్కడ 'వస్త్రం' అనే ప్రతీక ద్వారా కవి వర్ణించారు కవి. ముఖ్యంగా, సేవ చేసిన వస్తువును లేదా వ్యక్తిని చివరకు ఏ విధంగా విస్మరిస్తారో '*"చీకి, చీలికలు – పేలికలైన నన్ను విడిచీ/చీపురుతో చిమ్మి పెంట కుప్పల పార వేతురో!"* అన్న పంక్తులు ప్రతిఫలిస్తాయి. *"రాతి బండలపై పొర్లాడుతున్నానన్న వేదన గుర్తించరేం?"* అని అలుగ్గుడ్డ ఆవేదన చెందడం, యజమాని సౌకర్యం కోసం తన ఆకారాన్ని, రంగును (అస్తిత్వాన్ని) కోల్పోయిన సేవకుడి ఆర్తనాదంగా కనిపిస్తుంది. అంతేకాదు, నేటి సమాజంలో వృద్ధాప్యాన్ని ఒక భారంగా భావించి పక్కన పెట్టే 'వినియోగవాద' ధోరణికి నిలువుటద్దం. మనిషి విలువను అతని 'ఉపయోగం' బట్టి కాకుండా, అతని 'అస్తిత్వం' మరియు 'త్యాగం' బట్టి గుర్తిం చాలనే గొప్ప సందేశాన్ని కవి ఈ ప్రతీక ద్వారా అందించారు.

కాలక్రమ పరిణామం – జీవిత చక్రం:

అలుగ్గడ్డ కొన్ని సందర్భాల్లో మన ఇంట్లో పనిమనిషి చేసే సేవను ప్రతిఫలింపజేస్తూనే తాత్విక సత్యాలను చర్చకుపెట్టేలా...*"ఇల్లంతా తోమి, పామదంతో పంకిలం నాకు నేస్తం/ కురూపిని కాగానే దండేనికి వ్రేలాడబడతాను. /ఇంటిలోని మకిలిని తరుమగలమేగాని/ మనసుకంటిన మలినాన్ని తుడువగలమా/ తరతరాలకల్మషాన్ని తొలగుమంటారేగాని/ నిర్మలమైన జీవితాల్ని స్వాగతించరెందుకు?/ఎంత దయలేని వారు మీ జాతివారు?"* /'కాళీదాసుకమనీయంగా తెలిపినట్టు /శైశవాది దశలన్నియు నాకు నప్పుతాయి' అని వర్ణించారు కవి. కాళిదాసు రఘువంశ రాజుల జీవితంలోని నాలుగు దశలను (ఆశ్రమ ధర్మాలను) ఎంత క్రమశిక్షణతో గడిపేవారో రఘువంశం – 1.8 లో ఇలా వర్ణించారు.

"శైశవే2భ్యస్తవిద్యానాం/యౌవనే విషయైషిణామ్ ।
వార్ధకే మునివృత్తీనాం/యోగేనాంతే తనుత్యజామ్ ॥"

బాల్యంలో (శైశవ దశలో) కేవలం విద్యను అభ్యసించడంపైనే దృష్టి పెట్టేవారు. యౌవనంలో ధర్మబద్ధమైన కోరికలను తీర్చుకుంటూ, రాజ్యపాలన, గృహస్థాశ్రమం గడిపేవారు. ముసలితనం (వార్ధక్యం) రాగానే రాజ్యభారాన్ని సంతానానికి అప్పగించి, ముని వృత్తిని స్వీకరించి తపస్సు చేసేవారు.చివరకు యోగ సాధన ద్వారా దేహాన్ని త్యజించి మోక్షాన్ని పొందేవారు. అలుగ్గడ్డ' కవితలో కవి ఈ పురాణ ప్రతీకను చాలా చమత్కారంగా, లోతుగా వాడారు. రఘువంశ రాజుల వలెనే ఈ 'గుడ్డ' కూడా. శైశవంలో పత్తిగా విచ్చుకుంది. యౌవనంలో అందమైన వస్త్రంగా మారి అందరినీ మురిపించింది. వార్ధక్యంలో అలుగుడ్డగా మారి (ముని వృత్తిలాగా) నిస్వార్థంగా ఇల్లు శుభ్రం చేసే సేవలో నిమగ్నమైంది. చివరగా పెంటకుప్పలో కలిసిపోతూ (తను త్యజించడం) మట్టిలో మట్టిగా కలిసిపోతుంది. అంటే, ఒక గొప్ప రాజవంశీయుల జీవిత చక్రం ఎంత పద్ధతిగా సాగుతుందో, ఒక సామాన్యమైన అలుగుడ్డ జీవితం కూడా అలాగే అన్ని దశలను ("శైశవాది దశలన్నియు") సార్థకం చేసుకుంటుందని కవి ఇక్కడ కాళిదాసును ఉదాహరిస్తూ చెప్పారు.సాధారణంగా సాహిత్యం పట్ల ఉన్న ప్రగాఢమైన అవగాహన, కవి వ్యక్తిగత అనుభవాలు కవితా నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాయి. కాళిదాసు 'రఘువంశం'లోని ఉన్నతమైన జీవన విలువలని ఒక సామాన్యమైన అలుగ్గడ్డ జీవితానికి అన్వయించడం వెనుక కవికి గల సాహిత్య పరిపుష్టి కనిపిస్తుంది. రఘువంశ రాజులు తమ జీవిత దశలను (బాల్యం, యౌవనం, వార్ధక్యం) ఎంత పద్ధతిగా, త్యాగపూరితంగా గడిపారో, ఈ అలుగ్గడ కూడా తన ఉనికిని అలాగే సార్థకం చేసుకుంటుందని చెప్పడం ద్వారా, కవి సామాన్య వస్తువులోనూ 'ఉదాత్తత'ను (Sublimity) దర్శించ గలిగే దృక్పథం కనిపిస్తుంది. ఇది కేవలం పాండిత్యం మాత్రమే కాదు, సమాజంలోని శ్రమజీవుల పట్ల కవికి ఉన్న అనుభూతి చింతనగా కూడా చూడాలి. కాశీ వంటి పుణ్య క్షేత్రంలో, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉంటూ

- కవి: ఆచార్య చల్లా శ్రీరామ చంద్రమూర్తి

నిరంతరం సంస్కృత, తెలుగు సాహిత్యాల మధ్య తులనాత్మక ప్రయాణం చేసిన కవికి, లోకంలోని 'అనిత్యత్వం', 'సేవ' అనే అంశాలు నిత్య అనుభవాలు. అందుకే, పాత గుడ్డ ముక్క పడే వేదనను కేవలం వస్తుగతంగా చూడకుండా, దానిని ఒక ముని వృత్తితోనో, ఒక త్యాగధనుడి జీవితంతోనో పోల్చగలి గారు. తనకు తెలిసిన గొప్ప సాహిత్యం నుండి స్ఫూర్తి పొందు తూనే, తన కళ్ళముందు కనిపిస్తున్న నిరాదరణకు గురైన వృద్ధాప్యాన్ని, అణగారిన వర్గాల నిస్వార్థ శ్రమను కవి ఈ కవితలో ఏకీకృతం చేశారు.

బాహ్య శుద్ధి – అంతర శుద్ధి:

*"ఇంటిలోని మకిలిని తరుమగలమేగాని మనసుకంటిన మలి నాన్ని తుడువగలమా?"*అన్న ప్రశ్న కవితలో కీలకమైన మలు పు. ఇక్కడ 'అలుగ్గుడ్డ' కేవలం నేలను తుడిచే సాధనం మాత్రమే కాదు, అది విజ్ఞతకు ప్రతీక. బయట మెరుపుల కోసం ఆరాటపడే మనిషి, లోపల పేరుకుపోయిన స్వార్థం, అహంకారం అనే కల్మషాన్ని వదిలించుకోలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు కవి.*" ఇంటిలోని మకిలిని తరుమగలమేగాని / మనసుకంటిన మలినాన్ని తుడువగలమా?"* అని కవి వేసిన ప్రశ్న ఈ కవితకే ప్రాణవత్తరమైనది. మరోవైపు, అలుగ్గడ తనపై మురికిని వేసుకుంటూ ఇతరులకు శుభ్రతను ప్రసాదిస్తుంది. *"మలినమైన ఇంటి గదుల్ని... నా జీవిత చరమాంకంలో నలుపురంగు సంతరించుకుంటోంది"* అనడం ద్వారా సేవకుడు తన నైతికతను కోల్పోకుండా లోక కళ్యాణం కోసం చేసే త్యాగాన్ని సూచిస్తున్నారు కవి. మనిషి తన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేసుకోవడంలో చూపే శ్రద్ధను, తన అంతరాత్మను శుద్ధి చేసుకోవడంలో చూపడం లేదన్న పచ్చి నిజాన్ని కవి ఇక్కడ అలుగుడ్డ నోటి ద్వారా పలికించారు. ఇది బాహ్య ఆడంబరాల కంటే అంతఃశుద్ధి మిన్న అనే ఉన్నతమైన తాత్విక చింతనను ప్రతిఫలిస్తుంది.

పర్యావరణ స్పృహ:

ప్లాస్టిక్ యుగంలో కృత్రిమత్వానికి భిన్నంగా, పత్తి (సహజత్వం) తన చివరి దశలో కూడా భూమికి హాని చేయదని చెప్పడం ద్వారా ప్రకృతి సహజ సిద్ధాంతాన్ని ప్రతీకగా వాడారు. 'అలుగ్గుడ్డ' తన అస్తిత్వాన్ని ప్రకృతిలో కలిపే విధానం గొప్ప పర్యావరణ స్పృహను చాటిచెబుతుంది. *"కాలుష్య హేతువుని కాను/నర జాతికి హితైషి నేను"* అని చెప్పుకోవడం ద్వారా, కృత్రిమమైన ప్లాస్టిక్ వస్తువుల కంటే ప్రకృతి సిద్ధమైన పత్తి వస్త్రం ఎంత మేలైనదో కవి వివరించారు.

"మట్టిలో మట్టినౌతాను" అని ప్రకృతి నుండి వచ్చిన వస్తువు తిరిగి ప్రకృతిలోనే కలిసిపోవాలనే సనాతన ధర్మాన్ని గుర్తుచేస్తుంది. ఆధునిక నాగరికతలో మనం వాడుతున్న అనేక వస్తువులు పర్యావరణానికి హాని కలిగిస్తుంటే, అలుగుడ్డ మాత్రం తన మరణంలో కూడా భూమికి భారమవ్వనని సగర్వంగా ప్రకటి స్తుంది.*"నాగరికత ప్రతీక నేను"* అని అనడంలో, మనిషి సంస్కృతికి మూలాధారమైన వస్త్రం, తన అంతిమ దశలో కూడా పర్యావరణానికి హితైషిగా ఉండటమే నిజమైన నాగరి కత అని కవి భావన. ఈ కవితలో 'అలుగ్గుడ్డ' అనేది అణగారిన వర్గాల గొంతుకగా, నిరాదరణకు గురైన వృద్ధాప్యంగా, మనుషుల ద్వంద్వ ప్రవృత్తిని ఎండగట్టే ఒక సామాజిక దర్ప ణంగా కనిపిస్తుంది. *"కాలిపోతూ వెలుగునిచ్చే కొవ్వొత్తిని నేను"* అనడంలోనే ఆ ప్రతీకాత్మకత పతాక స్థాయికి చేరింది. వీటన్నింటితో పాటు ఈ కవితలో తెలుగు వారి సామాజిక జీవన సరళి, సాంస్కృతిక విలువల ప్రతి ఫలనం స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా, తెలుగు వారి గృహ జీవనంలో 'శుభ్రత'కుఇచ్చే ప్రాముఖ్యతను, ఇంటిని దేవాలయంగా భావించే సంస్కృతిని ఈ కవిత గుర్తుచేస్తుంది.

"ఇల్లు శుభ్రపరుస్తు న్నాననే విషయాన్ని మర్చిపోకు" అనడంలో, బాహ్య శుద్ధి వెనుక ఉండే అంకితభావాన్ని కవి చాటిచెప్పారు.

- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049



సాయి సాహిత్య ముచ్చట్లు 4

అంపశయ్యలో నేటికీ ఆకర్షించే అంశాలు?

విద్యావ్యవస్థలోని లోపాలు, కులమత రాజకీయాలు, విద్యార్థుల నైసర్గిక స్వభావాల కలబోతగా సాగే 'అంపశయ్య' నవల, ఒక తరం సామాజిక చరిత్రను రికార్డు చేసింది. 1960ల నాటి ఉస్మానియా క్యాంపస్ నేపథ్యమైనప్పటికీ, ఇందులో చర్చకు వచ్చిన ఆకలి, నిరుద్యోగ భయం, మేధోపరమైన సంఘర్షణలు నేటి డిజిటల్ యుగంలోనూ అంతే ప్రస్తావించుకోవాల్సిన స్థితిలో ఉండటమే రచయిత నవీన్ గారి దార్శనికతకు నిదర్శనం. అందుకే అది నేటికీ నిత్యనూతనంగా అనిపిస్తుంది. ఐరిష్ రచయిత జేమ్స్ జాయిస్ (James Joyce) రాసిన ప్రపంచ ప్రసిద్ధ నవల 'యులిసిస్' (Ulysses) ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. జేమ్స్ జాయిస్ 'యులిసిస్' నవలలో చైతన్య స్రవంతి రచనా శైలిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారు. ఒక వ్యక్తి మనసులో నిరంతరం సాగే ఆలోచనల ప్రవాహాన్ని, ఎటువంటి క్రమ పద్ధతి లేకుండా ఆవిష్కరించే ఈ పద్ధతినే నవీన్ గారు 'అంపశయ్య'లో రవి పాత్ర ద్వారా అనుసరించారు. 'యులిసిస్' నవల కథ మొత్తం కేవలం ఒక రోజు (18 గంటల పాటు) డబ్లిన్ నగరంలో జరుగుతుంది. సరిగ్గా 'అంపశయ్య' కూడా ఒక తెల్లవారుజామున మొదలై, అదే రోజు రాత్రి 18 గంటల కాలపరిమితిలో ముగుస్తుంది. జాయిస్ డబ్లిన్ నగరాన్ని ఎలాగైతే అక్షరబద్ధం చేశారో, నవీన్ గారు కూడా 1960ల నాటి ఉస్మానియా క్యాంపస్‌ను, హైదరాబాద్ గల్లీలను అంతే సజీవంగా చిత్రించారు. విద్యార్థి ప్రొఫెసర్ ఇంటికి వెళ్ళడం, ఆకలి వేస్తున్న దాన్ని చెప్పలేకపోవడం వంటివన్నీ వాస్తు యొక్క చిత్రీకరణలు.

తెలుగు సాహిత్యంలో 'చైతన్య స్రవంతి' (Stream of Cons ciousness) ధోరణిని పాఠకులకు చేరువ చేసిన ఈ అంపశయ్య నవల, కేవలం 18 గంటల కాలపరిమితిలో సాగుతుంది. ఒక తెల్లవారుజామున హాస్టల్ గదిలో కథానాయ కుడు రవికి వచ్చిన ఒక కల నుండి మొదలై, ఆ రాత్రి అదే గదిలో ముగిసే ఈ ప్రయాణం, ఒక 20 ఏళ్ల యువకుడి అంతరంగ ఘోషను నగ్నంగా ఆవిష్కరిస్తుంది. పరీక్షల ఒత్తిడి, నిద్రమత్తు, పాత జ్ఞాపకాల సుడిగుండంలో చిక్కుకున్న రవి మనసులో కుదురుండదు.

ఈ నవలలోని గొప్పతనం ఏమిటంటే, ఇందులో పాత్రలు కేవలం సంఘటనల ద్వారా కాకుండా, వారి ఆలోచనల తరంగాల ద్వారా మనకు పరిచయమవుతారు. రవి ఒక తెలివైన, మధ్యతరగతి యువ కుడు. ఇంటి దగ్గర తల్లి దండ్రులు పడే కష్టం గుర్తొచ్చినప్పుడు పశ్చాత్తాపం, కిరణ్మయి లాంటి ధనిక యువతుల గాలి సోకినప్పుడు కలిగే యవ్వన చాపల్యం రవిని నిరంతరం వేధిస్తుంటాయి. మీరు విశ్లేషించి నట్లుగా, రవిలోని ద్వైదీభావం (మార్క్స్ సిద్ధాంతాలను ప్రేమిస్తూనే రిక్షావాడి డిమాండ్‌ను దోపిడీగా భావించడం) ప్రతి మనిషిలో ఉండే సహజ బలహీనతను ఎత్తి చూపుతుంది. అభ్యుదయ భావాలున్న వేణు, డబ్బుతో మిడిసిపడే రెడ్డి, ఆశల రెక్కలతో ఎగిరిపోయే కిరణ్మయి, గతంలో మిగిలిపోయిన రత్తి – వీరంతా ఆనాడు ఉస్మానియా క్యాంపస్‌లో ఉన్నట్లే, నేటికీ ప్రతి విద్యాసంస్థలోనూ కనిపిస్తూనే ఉంటారు.

యవ్వనంలో ఉండే సహజమైన లైంగిక అశాంతిని, బయటికి చెప్పలేని భావోద్వేగాలను నవీన్ గారు అత్యంత ధైర్యంగా చర్చించారు. కొందరు దీనిని అశ్లీలతగా భావించినా, అది ఒక యువకుడి నైసర్గిక స్వభావమని లోతైన విశ్లేషణ చెబితే తప్ప అర్థం కాదు. నిరుద్యోగ భయం, మెస్ బిల్లు బాకీలు, ఆర్థిక నిస్సహాయత రవిని ఒకానొక దశలో 'చావు' వైపు ఆలోచించేలా చేస్తాయి. తన మరణం పట్ల ఇతరులు ఎలా స్పందిస్తారో ఊహించుకుని సానుభూతిని వెతుక్కునే రవి వైఖరి, మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రతి విద్యార్థి స్థితికి అద్దం పడుతుంది.

'అంపశయ్య' నవల విద్యావ్యవస్థలో కుళ్లును, విద్యార్థుల ఆశయాలను, ఆవేదనలను కలబోసిన ఒక బృహత్ కావ్యంలా నిలిచిపోతుంది. హ్యూమానిటీస్ కోర్సుల ప్రాధాన్యత తగ్గిపోతున్న నేటి కాలంలో, రవి లాంటి పాత్రలు చేసే మేధోమథనం, సాహిత్య చర్చలు మనం ఏం కోల్పోతున్నామో గుర్తుచేస్తాయి. ఉస్మానియా క్యాంపస్ గాలి సోకిన వారికే కాకుండా ఏ యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థికైనా తమ జీవితపు గమ్యంలో ఏదో ఒక దశలో 'అంపశయ్య'పై పవళించిన ప్రతి పాఠకుడికీ ఈ నవల ఒక ఆత్మీయ నేస్తంగా అనిపిస్తుంది. అది తన కథే అన్నంతగా అనుభూతి కలుగుతుంది. ఈ నవలలో మొదలైన రవి అంతర్మథనం, నవీన్ గారి ఆలోచనలు ఆ తర్వాత వచ్చిన 'ముళ్ళపొదలు', 'అంతస్స్రవంతి' నవలలతో కలిసి ఒక అద్భుతమైన 'నవలా త్రయం'గా రూపుదిద్దుకుంది. ఒక విద్యార్థి దశ నుండి సామాజిక బాధ్యత గల పౌరుడిగా రవి పరిణామం చెందే క్రమం ఈ నవలల్లో కనిపిస్తుంది. అంతేకాకుండా, తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్రను ఐదు దశాబ్దాల కాలం పాటు (1944–1994) అక్షరబద్ధం చేసిన ఆయన బృహత్ రచన 'కాలరే ఖలు' కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకోవడం ఆయన ప్రతిభకు మకుటాయమానం. 'అంపశయ్య' నవీన్‌గా పాఠకుల హృదయాల్లో ముద్ర వేసుకున్న ఆయన, తెలుగు నవలా సాహిత్యంలో మనిషి అంతరంగాన్ని, సమాజపు పోకడలను విడదీయలేని విధంగా ముడివేసి, ఒక నూతన ఒరవడిని సృష్టించారు.

ఆరు దశాబ్దాల క్రితం రవి అనుభవించిన ఆ 'అంపశయ్య' వేదన, నేటికీ ప్రతి అన్వేషికి ఒక చైతన్య దీప్తిగా వెలుగుతూనే ఉంటుంది.

డి. సాయినాథ్ రెడ్డి
6305584064
హైదరాబాద్ విశ్వవిద్యాలయం